క్లుప్తంగా

బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐగా నాగార్జున



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ

నందికొట్కూరు రూరల్ : నందికొట్కూరు మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐగా నాగార్జున ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ముచ్చుమర్రి ఎస్.ఐగా విధులు నిర్వహిస్తున్న ఈయన సాధారణ బదిలీల్లో భాగంగా బ్రాహ్మణకొట్కూరుకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గువ్వలకుంట్లలో 'వికసిత్ భారత్'



పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో సచివాలయం వద్ద ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ఎంపీడీఓ మేరి నిర్వహించారు. ఎంపీటీసీ సోమల స్రవంతి అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా రైతుల కోసం పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి, కిసాన్ క్రెడిట్ కార్డులు, పెట్టుబడి సాయం తదితర పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం పుల్లయ్య, ఏపీఓ రేష్మ, వికసిత్‌భారత్ కో–ఆర్డీనేటర్ నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్రారెడ్డి, రామిరెడ్డి, లోకేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సంక్రాంతికి ఆలయాలు ముస్తాబు



విద్యుద్దీపాలంకరణలో తాండవమల్లేశ్వర స్వామి ఆలయం

కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాలలో ఆలయాలు సంక్రాంతి పర్వదినానికి ముస్తాబయ్యాయి. గువ్వలకుంట్ల, దుద్యాల, నందికుంట, శివపురం, ఎర్రమఠం గ్రామాలలో ఆలయాలు విద్యుత్ దీపకాంతులతో కళకళలాడుతున్నాయి. కొత్తపల్లి మండల కేంద్రంలోని పార్వతీసమేత తాండవమల్లేశ్వర కళ్యాణ మహోత్సవం సందర్భంగా తాండవమల్లేశ్వర స్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయంలో ఉదయం స్వామివార్లకు బిందెసేవ, గణపతిపూజ, రుద్రాభిషేకం, పుణ్యాహవాచనం, వంటి విశేష పూజకార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా భోగిని పురస్కరించుకొని అన్ని గ్రామాలలోని ఆలయాల్లో మహిళలు, యువతులు దేవాతామూర్తులకు విశేషపూజాది క్రతువులను జరిపారు. ఇళ్లముందు సంక్రాంతి ముగ్గులు వేసి, గొబ్బెమ్మలుపెట్టి, పూలతో అలంకరించారు.

బీసీ రథయాత్రను విజయవంతం చేయండి

ఆత్మకూరు: బీసీ రథయాత్రను జయప్రదం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్, శ్రీశైలం నియోజకవర్గం అధ్యక్షులు వెంకటస్వామి గౌడ్, ప్రధాన కార్యదర్శి బాలస్వామియాదవ్, గౌరవ అధ్యక్షులు రామకృష్ణ, పట్టణ అధ్యక్షులు శ్రీహరి పిలుపునిచ్చారు. పట్టణంలోని బీసీ కార్యాలయంలో ఆదివారం యాత్రకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినా బీసీల తలరాతలు మారలేన్నారు. ఈ నెల 18 నుంచి రథయాత్ర ఆత్మకూరు నుంచి ప్రారంభమై కర్నూలు ఉమ్మడి జిల్లాలో కొనసాగుతుందని చెప్పారు. 18న ఉదయం పట్టణంలోని నంద్యాల ర్పింగ్ నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమై అక్కడ నుంచి గౌడ్‌సెంటర్, పాతబస్టాండ్, సంగమేశ్వరం సర్కిల్ చేరుకుని జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాల వేసి రథయాత్ర ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వీరన్న, నాయకులు నాగరాజు, రమణ, పెద్దన్న , వెంకటేశ్వర్లు, రాము తదితరులు పాల్గొన్నారు.

క్లింకర్ లారీ దగ్ధం



మిడుతూరు: గడివేముల జిందాల్ ఫ్యాక్టరీ నుంచి క్లింకర్ (సిమెంట్‌కు వినియోగించే ముడిసరుకు)లోడుతో బళ్లారికి వెళ్తున్న లారీ ఆదివారం మిడుతూరు–నందికొట్కూరు మధ్యలో ఉన్న పంచముఖి గోడౌన్ సమీపంలో దగ్ధమైంది. డ్రైవర్ నిద్రమత్తులో తోలడంతో లోడ్‌తో ఉన్న లారీ కుడివైపు రోహదారి పక్కన బోల్తా పడి.. పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. లారీలో ఉన్న బ్యాటరీలు షార్ట్ సర్క్యూట్ కావడంతో లారీ ఇంజన్ పూర్తిగా దగ్ధమైంది. లారీ డ్రైవర్ ప్రతాప్ చాకచక్యంగా బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. కర్నూలు నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఏఎస్ఐ సుబ్బయ్యను తెలిపారు.

సంప్రదాయబద్ధంగా భోగి మంటలు

- శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో కార్యక్రమం
- చిన్నారులకు సామూహిక భోగిపండ్లు



గంగాధర మండపం వద్ద భోగి మంటను వెలిగిస్తున్న దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు దంపతులు



చిన్నారికి భోగిపండ్లు పోసి ఆశీర్వదిస్తున్న ధర్మకర్త మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి

శ్రీశైలంటెంపుల్: సంస్కృతీ, సంప్రదాయ పరిరక్షణలో భాగంగా శ్రీశైల దేవస్థానం ఆదివారం వేకువజామున భోగిమంటలు కార్యక్రమాన్ని నిర్వహించింది. స్వామి అమ్మవార్లకు ప్రాతఃకాలపూజలు, మహామంగళహారతులు పూర్తయిన తరువాత ప్రధాన ఆలయ మహాద్వారం ఎదురుగా గంగాధర మండపం వద్ద భోగిమంటలు వేశారు. అర్చకస్వాములు, వేదపండితులు లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. సంప్రదాయబద్ధంగా పిడకలు, ఎండుగడ్డి, వంటచెరకు వేసి భోగిమంటలు వేశారు. సంక్రాంతి సందర్భంగా వేసే భోగిమంటలకు మన సంప్రదాయంలో ఎంతో విశిష్టత ఉంది. ఈ భోగిమంటలు వేయడం వలన దుష్టపీడలు విరగడై, అమంగళాలు తొలగి సకల శుభాలు కలుగుతాయని ప్రతీతి. కార్యక్రమంలో దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు దంపతులు, ఆలయ ఏఈఓ ఐ.ఎన్.వి. మోహన్, స్వామివారి ఆలయ ప్రధానార్చకులు వీరయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక భోగిపండ్లు

భోగి పండుగను పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక భోగిపండ్ల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఐదు సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు 150 మందికి పైగా ఈ భోగిపండ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని పఠించి, గణపతిపూజ జరిపారు. అనంతరం షోడశోపచార పూజలు నిర్వహించి రేగిపండ్లను, చిన్న చిన్న చెరకు ముక్కలు, పూలరెక్కలతో కలిపి పిల్లల తలచుట్టూ మూడుసార్లు తిప్పి భోగిపండ్లను పిల్లలపై వేశారు. భోగిపండ్లు వేయడం వలన పిల్లలకు పీడలు తొలగి, దృష్టి దోషాలు నశించి ఆయురారోగ్యాలు చేకూరుతాయని విశ్వాసం. కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి దంపతులు, ఈఓ డి.పెద్దిరాజు, ఏఈవో మోహన్, పీఆర్వో టీ.శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో భోగి వేడుకలు



నందికొట్కూరులో భోగి మంటలను వెలిగిస్తున్న యువకులు



యర్రగూడూరులో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

ఆత్మకూరు/ నందికొట్కూరు: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆదివారం భోగి వేడుకలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. మహిళలు ఇళ్లముందు కళ్లాపిచల్లి రంగురంగుల రంగవల్లుల మధ్య గొబ్బెమ్మలు, రేగిపళ్లు, నవదాన్యాలతో పాటు పలురకాల పూలతో అలంకరించారు. అనంతరం నువ్వులరొట్టెలు, సోవంకాయకూరతో పాటు రకరకాల కూరలు, కొత్తగా వచ్చిన ధాన్యంతో పలు రకాల పిండివంటలతో భోగి పండుగను కొత్తగా వచ్చిన అళ్లుల్లు, ఆడబిడ్డలతో ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. వాడవాడలా భోగి మంటలను వెలిగించారు. సుదూర ప్రాంతాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు, ఉద్యోగులు, ఇంటి ఆడపడుచులతో పట్టణ ప్రాంతాల నుంచి రావడంతో ఆనందం ఆకాశాన్నంటింది. రైతులు పండించిన పంటలు ఇంటికి చేరుకోవడం వల్ల కుటుంబంలో ఆనందం వెల్లువిరిసింది.

జూపాడుబంగ్లా: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం మండలంలోని జూపాడుబంగ్లా, తరిగోపుల, తాటిపాడు, పారుమంచాల, పి.లింగాపురం, తర్తూరు, భాస్కరాపురం, మండ్లెం, తూడిచెర్ల, పోతులపాడు, 80బన్నూరు, తంగడంచ గ్రామాల్లో ఆనందోత్సవాల మధ్య భోగివేడుకలను జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు తెల్లవారుజామున్నే లేచి భోగిమంటలను వేసుకొని చలికాచుకున్నారు. ఉదయాన్నే ఇళ్లముందు కళ్లాపిచల్లి రంగురంగుల రంగవల్లులు అలంకరించారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

పాములపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆదివారం భోగి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. దేవాలయాల్లో నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. చిన్నారులు పతంగులను ఎగురవేస్తూ ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు. యర్రగూడూరు గ్రామంలో శివసేవా యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామంలోని శివాలయం వద్ద నిర్వహించిన ఈ పోటీల్లో 19 బృందాలు పాల్గొన్నాయి. గ్రామంలోని ప్రజలు పెద్ద ఎత్తున ఈ పోటీలను తిలకించారు. పోటీ దారులు సంక్రాంతి పండుగ ప్రతిబింబించేలా ముగ్గులను వేశారు. సాయంత్రం చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీలు ప్రజలను ఎంతగానో అలరించాయి.

సుంకులమ్మకు బోనాల సమర్పణ

మహానంది: సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని బండిఆత్మకూరులో వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. బండిఆత్మకూరులో కొలువైన శ్రీ సుంకులా పరమేశ్వరి దేవి అమ్మవారికి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి పూజలు నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి బోనాలు తీసుకెళ్లి సమర్పించి నైవేద్యం అందించారు. ప్రతి ఏడాది సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా భోగి పర్వదినాన బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

మహానందిలో వైభవంగా



మహానందిలో భోగి మంటలు వేసిన కాలనీ వాసులు

మహానంది: గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం భోగి పురస్కరించుకుని మహానంది మండలంలో వేడుకలు నిర్వహించారు. వివిధ గ్రామాల్లో చిన్న పెద్ద బేధం లేకుండా అందరూ కలిసి భోగిమంటలు వేసుకొని ఉత్సవాలు జరుపుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో సంక్రాంతి సంబరాలు చేసుకునేందుకు ఉత్సాహం చూపారు.



జూపాడుబంగ్లాలో ఓ ఇంటిముందు రైతు ప్రాముఖ్యతను తెలుపుతూ వేసిన ముగ్గు



ఢీ అంటే ఢీ



షటిల్ బ్యాడ్మింటన్‌లో ప్రథమ విజేతలు శ్రీకాంత్, నరసింహలకు నగదును అందజేస్తున్న దృశ్యం

పగిడ్యాల: సంక్రాంతి తిరుణాల ఉత్సవాలలో భాగంగా ఆదివారం పడమర ప్రాతకోట కాశీవిశ్వేశ్వర, నందీశ్వరస్వామి దేవాలయ ఆవరణంలో జరిగిన రెండు పళ్ల పొట్టేళ్ల పందెంలో ఢీ అంటే ఢీ అంటూ పొట్టేళ్లు తలపడ్డాయి. పందెంలో ఆయా ప్రాంతాల నుంచి 20 పొట్టేళ్లు పాల్గొన్నాయి. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన పోటీలను తిలకించేందుకు సమీపంలోని ఎం.ఎస్. ఘణపురం, భాస్కరాపురం, లక్ష్మాపురం, పగిడ్యాల, సంకిరేణిపల్లె, బీరవోలు తదితర గ్రామాల నుంచి ప్రజలు అధికం సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజల కేరింతల మధ్య తలపడిన పొట్టేళ్లు పోటాపోటీగా తలపడి చూపరులను అబ్బురపరిచాయి.

విజేతలకు బహుమతుల పంపిణీ

ఆదివారం ఉదయం జరిగిన ట్రాక్టర్ రివర్స్ పందెం , షటిల్ బాడ్మింటన్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులను పంపిణీ చేసినట్లు కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అంబటి శివశంకర్‌రెడ్డి తెలిపారు. అయ్యస్వామి, చాకలి రవికుమార్, బోయ పవన్‌కుమార్, బోయ వెంకటరమణలు రివర్స్ పందెంలో ప్రతిభను కనబరిచి విజేతలుగా నిలిచారు. బహుమతి దాతలు చికెన్ వెంకటస్వామి, దివాన్‌సాహెబ్, పుట్ట క్రిష్ణ, సుబయ్య విజేతలకు నగదును అందజేశారు. అలాగే హోరాహోరీగా సాగిన బ్యాడ్మింటన్ పోటీల్లో 40 టీమ్‌లు పాల్గొన్నాయి. శ్రీకాంత్(ప్రాతకోట), శివ(జూపాడు బంగ్లా), సాధిక్(నందికొట్కూరు), రహిమాన్(ప్రాతకోట) టీమ్‌లు వరుసగా విజేతలుగా నిలిచారు. వీరికి కమిటీ సభ్యులు రూ. 5 వేలు, రూ. 3 వేలు, రూ. 2 వేలు, రూ. 1 వెయ్యి నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు అస్లాంబాషా, సొసైటీ డైరెక్టర్ దివాన్‌సాహెబ్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు, వార్డు మెంబర్ అమీర్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్లారెడ్డి, నాగేశ్వరరెడ్డి, రమణప్రసాద్, కురువ మల్లయ్య, కురుమన్న, అలీబాషా తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జికి నేడు సన్మానం

పగిడ్యాల: రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం (హైకోర్టు)లో జడ్జిగా విధులు నిర్వహిస్తున్న ఎస్. హరినాథ్‌కి సోమవారం ఉదయం 10 గంటలకు తూర్పు ప్రాతకోట గ్రామంలో సన్మానం చేస్తున్నట్లు గ్రామస్తులు చిలుకల శంకర్‌రెడ్డి, ఏ మోక్షేశ్వరరెడ్డి, రామలింగేశ్వరరెడ్డి, యుగంధర్‌రెడ్డి, రవీంద్రానాథ్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాతకోట గ్రామానికి చెందిన ఎస్.హరినాథ్ రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం జడ్జిగా విధులు నిర్వహిస్తుండడం గ్రామానికే గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రముఖులు హాజరవుతారని వారు వెల్లడించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మహానంది: మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన వెంకటస్వామి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 30 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఆయన వద్ద 30 క్వార్టర్ సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: పట్టణంలోని శివాలయంలో సోమవారం సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. స్వామివారికి పంచామృతాభిషేకం , అమ్మవారికి కుంకుమార్చన విశేషపూజలు నిర్వహిస్తారన్నారు. ప్రత్యేక పూజలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిఅమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

సీఎం జగనన్నతోనే రైతుల సంక్షేమం



విజేతలైన ఎద్దుల యజమానులకు నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రైతుల సంక్షేమం సాధ్యమవుతుందని కర్నూలు జిల్లా కోర్టు పీపీ వెంకటరెడ్డి, ఏపీ టూరిజం మాజీ డైరెక్టర్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. మకర సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఆదివారం భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని తరిగోపుల గ్రామంలో అంతర్‌రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ముందుగా ఎద్దులకు పూజలు నిర్వహించి చర్నాకోలను ఊపి ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీ.కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, చిన్నకృష్ణారెడ్డి, నాగేశ్వరరెడ్డి, బాలస్వామి, చంద్రశేఖర్‌రెడ్డి, ధర్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జయశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వృషభాల జయకేతనం

ఎద్దుల బండలాగుడు పోటీల్లో తెలంగాణ రాష్ట్రం, గద్వాల జిల్లా, మల్దేకల్ మండలం, గొర్లఖాన్‌దొడ్డి గ్రామానికి చెందిన కుర్వ కర్రెప్ప వృషభాలు విజయకేతనం ఎగురవేసి రూ.50వేలు కైవసం చేసుకున్నాయి. కర్నూలు నగరం, మాసామసీదుకు చెందిన రమేష్‌నాయుడు ఎద్దులు ద్వితీయస్థానంలో నిలిచి రూ.40వేలు, వైఎస్సార్ కడప జిల్లా, పెద్దశెట్టంపల్లెకు చెందిన శేఖర్ వృషభాలు తృతీయ స్థానంలో రూ.30వేలు చేజిక్కించుకున్నాయి. వైఎస్సార్ కడప జిల్లా, రంగసాయిపల్లె కు చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డి ఎద్దులు నాల్గొవస్థానంలో నిలిచి రూ. 20వేలు, పెండేకల్లు కు చెందిన నాగభూషణం ఎద్దులు ఐదొవ స్థానంలో నిలిచి రూ.10వేలు దక్కించుకున్నాయి. పగిడ్యాలకు చెందిన కోరల గిరిజ కు చెందిన ఎద్దులు ఆరోవస్థానంలో నిలిచి రూ.5వేలు కైవసం చేసుకున్నాయి.

మహానందిలో నేడు పూజలు

మహానంది: సంక్రాంతి మహోత్సవంలో భాగంగా మహానంది ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆది వారం వేద పండితులు రవి శంకర్ అవధానితో కలిసి ఆయన మాట్లాడుతూ సోమవారం మధ్యాహ్నం మకర సంక్రమణం సందర్భంగా శ్రీ కామే శ్వరి, మహానందీశ్వర స్వామి వార్లకు ప్రత్యేక అభిషేకార్చనలు, ఉత్సవమూర్తులకు తిరుమంజనం పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మంగళవారం కనుమ రోజున సాయంత్రం స్వామి అమ్మవార్లకు గ్రామోత్సవం, పారువేట ఉత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

తూడిచెర్ల సబ్‌ఛానల్‌కు 655 క్యూసెక్కుల నీరు

జూపాడుబంగ్లా: లాకిన్స్‌లా నుంచి తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 655 క్యూసెక్కుల సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం రెండు మోటార్ల ద్వారా 735 క్యూసెక్కుల నీటిని కేసీ కాల్వకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతుల వినియోగార్థం లాకిన్స్‌లా వరకు చేరుతున్న 655 క్యూసెక్కుల సాగునీరు లాకిన్స్‌లా వరకు చేరుతున్నట్లు వెల్లడించారు. ఈ నీటిని తూడిచెర్ల సబ్‌ఛానల్‌కు మళ్లిస్తున్నట్లు చెప్పారు.

రథోత్సవం ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమైన నందికొట్కూరు రూరల్ సీఐ విజయ్‌భాస్కర్

పగిడ్యాల: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని తూర్పు, పడమర ప్రాతకోట గ్రామాల్లో సోమవారం జరిగే నాగేశ్వరస్వామి, అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర, నందీశ్వరస్వామి రథోత్సవ వేడుకలను ఉత్సవ కమిటీ సభ్యులు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని నందికొట్కూరు రూరల్ సీఐ విజయ్‌భాస్కర్ సూచించారు. ఆదివారం ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌లో కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. సీఐ మాట్లాడుతూ రథోత్సవ వేడుకల్లో అల్లర్లు చోటుచేసుకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్కెస్ట్రా, డీజే, రికార్డింగ్ డ్యాన్స్‌ల నిర్వహణకు అనుమతి లేదని స్పష్టం చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించలేదని హెచ్చరించారు. పార్టీలకతీతంగా రథోత్సవ వేడుకలను ప్రశాంతంగా జరుపుకుని పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐలు నాగార్జున, ఆర్.జయశేఖర్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలి



కీడాకారులను పరిచయం చేసుకుంటున్న శిల్పా కార్తీక్‌రెడ్డి

ఆత్మకూరు/వెలుగోడు: క్రీడాకారులు ఆటల్లో స్ఫూర్తిని చాటాలని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గం నాయకులు శిల్పాకార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఈడెన్ గార్డెన్‌లో, వెలుగోడులోని డిగ్రీ కాలేజీ మైదానంలో ఆదివారం టాస్ వేసి, క్రీడాకారులను పరిచయం చేసుకొని కేపీఎల్ మ్యాచ్‌లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నియోజకవర్గ స్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి జీవితంలో ఉన్నతంగా ఎదగాలని, నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. వెలుగోడులో మాభూమి క్యాలెండర్ 2024 ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వెలుగోడు మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ జయపాల్, ఆత్మకూరు నాయకులు దేశం తిరుపం రెడ్డి, పువ్వాడ భాస్కర్, విజయచౌదరి, హనుమంతరెడ్డి, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ యువత



నాభిశిల వద్ద పారిశుద్ధ్య పనులు చేస్తున్న యువకులు

పాములపాడు: ఎవరో వస్తారు ఏదో చేస్తారు అని ఎదురు చూడక యువత స్వచ్ఛందంగా కదిలారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులకు శ్రీకారం చుట్టారు. మండలంలోని వాడాల గ్రామంలో వినాయక కమిటీ యువకులు పార, చలిక, బాలె చేత బూని తమ వంతుగా గ్రామంలో నాభిశిల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టారు. నిత్యం మురికి కూపంగా ఉండే ఆ ప్రాంతంలో మురికిని తొలగించారు. నాభిశిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువకులు గ్రామస్తుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. వినాయక మిటీ యువకులు అల్లబకాష్, మోహన్ కుమార్, అనిల్‌కుమార్, దెవకటేష్, దిలీప్, మల్లికార్జున, భాస్కర్, సూరి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదా కల్యాణం



గోదా కల్యాణం నిర్వహిస్తున్న పండితులు , కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



తరిగోపులలో కల్యాణ తంతు జరిపిస్తున్న అర్చకులు



గాజులపల్లెలో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

వెలుగోడు: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం గోదా కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్థానికులు జూటూరు ఎల్లా రమేష్ కుమార్, బల్లాని రామాంజనేయులు దంపతులు ఉభయదారులుగా వ్యవహరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని శ్రీశైల నియోజకవర్గ ఎమ్మెల్యే చక్రపాణిరెడ్డి తనయుడు శిల్పా కార్తీక్ రెడ్డి దర్శించుకున్నారు. ఆయనను ఆలయ పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేసి, శాలువాతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. బండి ఆత్మకూరుకు చెందిన అపర్ణ దీపిక శిష్యురాలు మమతా కుమారి (ఆత్మకూరు వాస్తవ్యురాలు)చే గోదా కల్యాణం నృత్య ప్రదర్శన నిర్వహించారు. వెలుగోడు ఆర్యవైశ్య మహిళలు కోలాటం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బల్లాని వెంకట సత్యనారాయణ, కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, రమణయ్య, నాగార్జున, నాగేశ్వరరావు, అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, జయపాల్, ఇలియాస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథస్వామి కల్యాణం

మహానంది: గాజులపల్లెలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ సేవ సమితి ఆధ్వర్యంలో భోగి పండగ పురస్కరించుకొని ఆదివారం గోదాదేవి సమేత రంగనాథ స్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి, అమ్మవారిని విశేషంగా అలంకరించిన కళ్యాణం జరిపారు. భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. భక్తులకు స్వామి, అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందించారు.

కనుల పండువగా శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం

జూపాడుబంగ్లా: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని తరిగోపుల గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామివార్ల కల్యాణాన్ని భక్తులు ఆదివారం సాయంత్రం కనుల పండువగా నిర్వహించారు. ముందుగా అర్చకులు వైకుంఠనాథుడైన శ్రీచెన్నకేశవ స్వామి, శ్రీలక్ష్మీదేవి అమ్మవార్ల విగ్రహాలకు పంచామృతాభిషేకం నిర్వహించి పన్నీటిస్నానం చేయించారు. అర్చకులు వేదమంత్రాలు పఠిస్తుండగా నూతనవస్త్రాలతో స్వామి, అమ్మవార్ల విగ్రహాలను వధూ, వరులుగా తీర్చిదిద్దారు. ముస్తాబైన స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పెళ్లిపీఠంపై ఆశీనులు గావించి వేదమంత్రాల మధ్య కల్యాణక్రతువు జరిపించారు. స్వామి, అమ్మవార్ల కళ్యాణాన్ని కనులారా వీక్షించిన భక్తులు తరించిపోయారు. అలాగే శ్రీఅనంత నాగేశ్వరస్వామివారికి పంచామృతాభిషేకాలు, బిల్వార్చన, కుంకుమార్చనలు నిర్వహించారు.

నేడు రథోత్సవం: స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు సోమవారం సాయంత్రం రథోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఏడి వెంకటరమణ, ఆలయ ధర్మ కర్త చిన్న కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు తెలిపారు. రథోత్సవం అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.